ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర పాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 7 ప్రకారం రూ.18,500 వేతనాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి ఇంజినీరింగ్ విభాగం లో పని చేస్తున్నవారికీ కనీస వేతనం ఇవ్వాలన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి చొరవ తీసుకోవాలని, నగర మేయర్ సురేష్ బాబు కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వచ్చే నెల 3న రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్ కార్యాలయ వద్ద జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సహాయ కార్యదర్శులు ఎం.ఆనంద రావు, టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

దిగుబడి భళా.. ధరలు ఢీలా!

- టమోటా రైతులు విలవిల
- 20 రోజుల కిందట బాక్స్ ధర రూ.700.. ప్రస్తుతం రూ.150
- జిల్లాలో వేల ఎకరాలలో సాగు
- ధరల కోసం ఎదురు చూస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో రబీ సీజన్‌లో రైతులు టమోటా పంటను సాగు చేపట్టారు. జిల్లాలో అధికంగా మైదుకూరు మండల పరిధిలోనే 6వేల ఎకరాల వరకు టమోటా పంటను సాగు చేశారు. దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాలలో 2 వందల ఎకరాలలో, ఇతర మండలాలలో 50 ఎకరాలలోపు టమోటాను రైతులు చేపట్టారు. సాగు చేసిన టమోటా దిగుబడి బాగా వచ్చినప్పటికీ చేతికొచ్చే సమయానికి ధరలు తగ్గడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. 20 రోజుల కిందట బాక్స్ (30 కిలోలు) రూ.700 ఉన్న ధర ప్రస్తుతం రూ.150కు పడిపోయింది. డిసెంబర్ మొదటి వారం నుంచి టమోటా దిగుబడి అధికంగా వస్తోంది. టమోటా ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు రూ. 40 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 10 నుంచి రూ.15 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ప్రకారం రైతులకు బాక్స్ రూ.500 వరకు రావాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దళారులు సూచించిన ధరలకు రైతులు టమోటాను అమ్ముకోవాల్సి వస్తుంది. మన ప్రాంతంలో దిగుబడి రాక ముందు మదనపల్లి, చిత్తూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారు .అప్పుడు కిలో ధర రూ.50 కి పైగా ఉన్నాయి. మైదుకూరు ప్రాంతంలో ముందస్తుగా సాగుచేసిన పంట 30 కిలోల బాక్స్ ధర రూ. 700 పలికాయని రైతులు పేర్కొంటున్నారు. రాబోయే నెలరోజుల పాటు వర్షాలు నమోదు అయితే పంట దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉల్లి పంట అధిక వర్షాలకు దెబ్బతిని దిగుబడులు పూర్తిగా తగ్గాయి. నూర్పిడి సమయంలో ధరలు కూడా గణనీయంగా తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.. గత నెలలో క్వింటా రూ.3 వేలు పలికిన ఉల్లి గడ్డలు ప్రస్తుతం రూ.15వందలు పలుకుతున్నాయి. ఉల్లి సాగుచేసిన రైతులు అన్ని విధాలా నష్టపోయారు. రైతుల ఆశలన్నీ టమోటా పంటపై ఉన్నాయి. అది పూర్తిగా ఆచరణలో విఫలమైంది. 30 కిలోల బాక్స్ ధర రూ. 300 నుంచి రూ. 600 రూపాయల వరకు గత ఏడాది అమ్మకాలు జరిగాయి. కేవలం ఈ ఏడాది ఒక నెలపాటు ఈ ధరలు ఉంటే ఎకరాకు రూ. 50 వేల వరకు ఆదాయం వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా టమోటా పంటలో వారానికి వంద బాక్సుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ధరలు కాస్త ఉంటే ఎరువులు, పురుగుమందులు పిచికారి చేసి పంటను జనవరి చివరి వరకు కాపాడుకోవచ్చని రైతులు సూచిస్తున్నారు. ప్రస్తుతం సాగుచేసిన టమోటా పంట ఆశాజనకంగా ఉందని పురుగు బెడదకూడా కాస్త తక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

టమోటా దిగుబడి

ఎకరాకు రూ.40వేలు ఖర్చు

టమోటా సాగుకు ఎకరాకు రూ. 40 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ధరలు చూస్తే ఆందో ళనగా ఉంది. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు అధికమయ్యాయి. దిగుబడులు చేతికి వచ్చే సమయానికి ధరలు ఉండడం లేదు.

- రవి, రైతు, క్రిష్ణా పురం.

పంట ఆశాజనకంగా ఉంది

టమోటా పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. దిగుబడులు ప్రారంభమయ్యాయి. ధరలు 30 కేజీల బాక్స్ రూ.150వ రకు పలుకుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గాయి. బాక్స్ టమోటా రూ.400 ఉంటే లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

– సునిల్ కుమార్ రెడ్డి, టమోటా రైతు, ఉత్సలవరం, మైదుకూరు.

ధరలు అమాంతం తగ్గిపోయాయి

పది రోజుల కిందట బాక్స్ ధర రూ.700 గా ఉన్న ధరలు ఒక్కసారిగా రూ.150కి తగ్గిపోయింది. దళారులు నిర్ణయించినదే ధర మారుతుంది. పది రూపాయలు సంపాదించుకోవచ్చు అన్న ఆశతో టమోటా పంటను సాగు చేస్తే ధరలు చూస్తే కన్నీరు వస్తుంది. మార్కెట్లో ధరలు ఉన్నప్పటికీ వ్యాపారులు వారి ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తున్నారు. రైతులు దిగుబడి వచ్చిన సమయానికి ధరలు తగ్గించడం సాధారణ మైపోయింది. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామాంజనేయుల రెడ్డి, రైతు, మైదుకూరు.

గండికోట నిర్వాసితులను ఆదుకుంటాం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

గండికోట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి

ప్రజాశక్తి-కొండాపురం

గండికోట నిర్వాసితులను ఆధుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం కడప జిల్లా కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రాష్ట్రాన్ని సస్యశ్యామలం, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగక నిర్వీర్యం చేశారని, అన్ని రంగాలను అభివృద్ధి చేయక ముఖ్యంగా నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో ఇరిగేషన్ శాఖను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఎక్కడ కూడా ఇరిగేషన్‌కి సంబంధించి ఒక రిజర్వాయర్ గాని నిర్మించలేదన్నారు. ఆఖరికి లాకులు, షెట్టర్స్, డోర్స్, కనీసం తెలియని పరిస్థితన్నారు. ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేయడం అంటే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసినట్లేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి ప్రతి ఆఖరి ఎకరా వరకు తీసుకువెళ్లాలని, తాగునీరును అందించాలని ఉద్దేశంతో ముందుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వరకు 95 శాతం రిజర్వాయర్లను నీటితో నింపామని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని చెరువులను నీటితో నింపామని చెప్పారు. వాటర్ మేనేజ్మెంట్ పర్ఫెక్ట్‌గా చేయడం వల్లనే జిల్లాలో ఉన్న 250 చెరువులను నీటితో నింపడం సాధ్యమైందన్నారు. గండికోట నిర్వాసితులకు సంబంధించి సమస్యలు, నష్టపరిహారాలు, ఆర్అండ్ఆర్ తదితరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని, రతనాల సీమగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగక పోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గండికోట నిర్వాసితులకు సంబంధించి ప్రభుత్వంతో చర్చలు జరిపి నష్టపరిహారాలను అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం గండికోట నిర్వాసితుల నుండి రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అర్జీలు స్వీకరించి తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. తొలుత మంత్రి గండికోట ప్రాజెక్టును సందర్శించి జల వనరుల శాఖ అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వనరుల శాఖ సిఇ శ్రీనివాసులు, ఎస్ఇలు మల్లికార్జునరెడ్డి, వెంకటరామయ్య, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గండికోటను పరిశీలించిన మంత్రి

జమ్మలమడుగు రూరల్ :రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డితో కలిసి ఆదివారం గండికోటను సందర్శించారు. గండికోట సర్పంచ్ గురు ఈశ్వర్ గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బొమ్మేపల్లి, భీమునిరాయుని కట్టాల, ఒంటిమిద్దె గ్రామాల్లో సుమారు 400 ఎకరాలకు నీటి అందించేందుకు మైలవరం జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారని చెప్పారు. పథకం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన వస్తువులు చోరీ చేయడంతో రైతులు సాగు నీటికి ఇబ్బదులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం పెద్దమోడియం మండలం నెమలదిన్నె, చిన్న ముడియం గ్రామాలకు చెందిన రైతులు, బాధితులు రాజోలి ప్రాజెక్టు గురించి వినతిపత్రం అందజేశారు, మైలవరం మండలం దన్నవాడ గ్రామానికి చెందిన నాయకులు చెరువులో నీటి సామర్థ్యం పెంచాలని కోరారు. అనంతరం ఆదినాయణరెడ్డి, భూపేష్‌రెడ్డితో కకలిసి గండికోట వ్యూ పాయింట్ వద్ద నుంచి మైలవరం ప్రాజెక్టును గండికోట గ్రాండ్ కెనాల్‌ను లోయను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు గోన పురుషోత్తమ్ రెడ్డి, యూత్ నాగేశ్వరరెడ్డి, పాలూరు సుధీర్ కుమార్ రెడ్డి, మోరగుడి విశ్వనాథ్ రెడ్డి, కొమెర్ల రామాంజనేయ రెడ్డి, బిర్రు సంతోష్ పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయాన్ని దర్శించిన మంత్రులు

కడప అర్బన్ : జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు ముందుగా కడప శ్రీ విజయ దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు.

బోట్లు మంజూరు చేయాలని వినతి

ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ఆదేశాల మేరకు దేవుని కడప నేతలు దేవుని కడప చెరువులో 4 పెడల్ బోట్లు,1 మెకానికల్ బోటు మంజూరు చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. ఆదివారం జనసేన కార్యాలయం వద్ద మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ఎద్దుల శంకర్,ఆకుల గోపి, బాలకృష్ణ, గుగ్గిలం శంకరయ్య, అడవాల రాజ పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు

- సిద్ధవటం కోట సందర్శనలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక సంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం కడప జిల్లా పర్యటనలో భాగంగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పర్యాటక అధికారులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ సిద్ధవటం కోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండో శతాబ్దం నాటి మట్లి రాజులు నిర్మించిన అద్భుతమైన సిద్ధపటం కోటలోని శివాలయం మసీదు, పరిశీలించానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారాలతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం పిపిపి మోడల్‌లో ఇన్వెస్టర్లతో ఇటీవలే సమావేశం కూడా నిర్వహించామని తెలిపారు. సిద్ధవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సఫారీ, బోటింగ్, రెస్టారెంట్, సర్క్యూట్ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిద్ధవటం కోటలోని శిథిలావస్థకు చేరుకున్న వాటికి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు బస చేసి ఇక్కడి ప్రాంతాలను సందర్శించుకునే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తోందన్నారు. జిల్లాలోని గండికోటకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సహకారం అందించిందని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో కూడా సహకారాన్ని తీసుకొని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజంలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం తీసుకున్నస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముందుగా సిద్ధవటం కోటలో కాలినడకన పలు ప్రదేశాలను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సిద్ధవటం కోటను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాయచోటిలో కాల్పుల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి
- నిందితుల కోసం పోలీసు జాగిలంతో గాలింపు
- ఘటనపై రవాణా శాఖ మంత్రి 'మండిపల్లి' ఆరా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో కాల్పులు కలకలం సృష్టించాయి. రాయచోటి మండల పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గయపడ్డారు. కాటిమాయకుంట సమీపంలో గుడిసెలు వేసుకుని చిక్కు వెంట్రుకలు, పాతసామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సంబేపల్లె మండలం నామాలగుట్టకు చెందిన నీలకంఠ హనుమంతు(50), సల్ల రమణ(30) అనే వ్యక్తులు మాధవరం గ్రామంలోని మద్దెలకుంట గ్రామానికి వెళుతుండగా రోడ్డుపక్కనున్న గుట్టల్లోంచి గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరూ రక్తపు మరకలతో వారు నివాసం ఉంటున్న గుడిసెల వద్దకు చేరుకోగానే బంధువులు హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గుర్తుతెలియని వ్యక్తి తుపాకీతో కాల్పులు జరిపినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ కాల్పుల్లో రమణపై రెండు రౌండ్లు కాల్పులు జరపగా, హనుమంతుపై ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు డాక్టర్లు గుర్తించారు. తమకు ఎవరితో విభేదాలు లేవని, కాల్పులు ఎందుకు జరిపారో తెలియదని బంధువులు అంటున్నారు. కాల్పుల ఘటనపై రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు జాగిలంతో ఆదివారం ఉదయం 9 గంటల నుండి కాటిమాయకుంట గ్రామ శివారు ప్రాంతంలోని గుట్టలలో క్షుణ్ణంగా పరిశీలించారు. జాగిలం కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి ఆగడంతో అక్కడ రక్తపు చుక్కలను గుర్తించారు. రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్, రూరల్ సిఐ తులసి రామ్, ఎస్ఐ నర్సింహారెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నరు. ఏది ఏమైనప్పటికీ తుపాకీ కాల్పులు కలకలం రేపడంతో రాయచోటి పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

మృతి చెందిన హనుంతు

చికిత్స పొందుతున్న రమణ

కాల్పుల ఘటనపై మంత్రి 'మండిపల్లి' అరా

రాయచోటి మండలం పరిధిలోని మాధవరంలో ఇద్దరి వ్యక్తులపై కాల్పులు జరిగిన ఘటనపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. కాల్పుల ఘటనపై ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాల్పుల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

విద్యుత్ ఆస్తుల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

విద్యుత్ ఆస్తులను ప్రయివేటు వారికి ఇస్తే ఒప్పుకోమని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు కార్యదర్శి ముజఫర్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు ఆధ్వర్యంలో విద్యుత్ ప్రయివేటీకరణ, విద్యుత్ ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్యఅతిథి సిహెచ్ నరసింగరావు, ముజఫర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగ సంస్థలను ప్రయివేట్ వారికి ఇచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు జాగరుకతతో వ్యవహరించాలన్నారు. దేశంలో రూ. 85 లక్షల కోట్ల విద్యుత్ ఆస్తులున్నాయని, వాటిని ప్రయివేట్ పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చండీగర్, ఉత్తప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు అక్కడి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రయివేటీకరణ చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇంజినీర్స్ అండ్ ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో అదాని ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. స్ట్రగుల్ కమిటీ చైర్మన్, కన్వీనర్ సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు 2022 వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు కరువు భత్యంలను విడుదల చేయాలని, కాంట్రాక్టు కార్మికుల మధ్య ఉన్న వేతన తేడాలను సవరించాలని చెప్పారు. కార్యక్రమంలో డిస్కాం సంఘం అధ్యక్షుడు శివ శంకర్, స్ట్రగుల్ కమిటీ నాయకులు గంగయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులు రెడ్డి, రాజశేఖర్. నాయబ్ రసూల్, నాగ సుబ్బయ్య, శ్రీహరి, సురేంద్ర, నాగమల్లయ్య, శివ, నందీశ్వర్ రెడ్డి, రమణ రాజు, చంద్రారెడ్డి, సుబ్బయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న సిఐటియు, స్ట్రగుల్ కమిటీ నాయకులు

'సన్నపురెడ్డి'కి అవార్డు ఒక మేలు కలయిక

ప్రజాశక్తి - కడప అర్బన్

కేతు విశ్వనాథరెడ్డి పేరు మీద సన్నపురెడ్డికి అవార్డు ఇవ్వడం మేలుకలయిక అని ఇద్దరి మధ్య ఒక తరం అంతరం ఉన్నా, ఆ అంతరాన్ని పూర్తి చేసుకుంటూ సాహిత్యం సృజిస్తున్నవాడు సన్నపురెడ్డి అని సాహిత్య విమర్శకులు మేడిపల్లి రవికుమార్ అన్నారు. ఆదివారం సిపిబ్రౌన్ గ్రంథాలయంలో కవిత, విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కేతు స్మారక జీవన సాఫల్య పురస్కార సభ నిర్వహించారు. సంస్థ వ్యస్థాపక అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, వారి సతీమణి దుర్గాకుమారి, ముఖ్య అతిథి, డి.ఆర్.వో. విశ్వేశ్వరనాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ఇచ్చారు. ప్రధాన వక్త మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కథ, కథానికి మధ్య తేడా అర్థం కావాలని పేర్కొన్నారు. అప్పుడే ఈ కాలపు కథ అర్థం అవుతుందని తెలిపారు. ప్రపంచాన్ని ప్రేమించాలంటే చాలా వదులుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మనలో కుల, మతాహంకారాన్ని వదులుకోవాలని, సన్నపురెడ్డి కథలు ఇదే చెబుతుందన్నారు. చనుబాలు కథ ఈ కులాహంకారాన్ని కూలగొట్టే కథ అన్నారు. మనిషిలోని సంఘర్షణను చిత్రించాలంటే గొప్ప మనసు కావాలని పేర్కొన్నారు. ఆ మనసు సన్నపు రెడ్డికి ఉంది కాబట్టే గొప్ప సాహిత్యం రాశాడని చెప్పారు. సభలో వక్తలు, వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బొల్లు కృష్ణమూర్తి, అలపర్తి పిచ్చయ్య చౌదరి, కేతు కుమారులు శశికాంత్, కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్

బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలానికి చెందిన రాళ్లపల్లి ప్రసాద్ అనే జనసేన పార్టీ కార్యకర్త ఆదివారం కడపలో జరిగిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల ఆత్మీయ సమావేశానికి పోరుమామిళ్ల నుంచి వచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఫిట్స్ రావడంతో సమావేశ హాలు ఎదుట అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్న వారు 108 వాహనం ద్వారా కడప రిమ్స్ కు తరలించారు. డాక్టర్ అతనికి సిటీ స్కాన్ చేయగా, అందులో అతనికి బ్రెయిన్ స్ట్రోక్ కొట్టిందని చెప్పారు. జనసేన కార్యకర్త పరిస్థితి చాలా విషమంగా ఉంది. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా బాగోలేదని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ విషయం రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదుకోవాలని జనసేన నాయకులు, ప్రసాద్ కుటుంబ సభ్యులు కోరారు.

మానవత్వం వెల్లివిరియాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మనుషుల్లో మానవత్వం వెల్లి విరిసినప్పుడే సమాజం సుఖశాంతులతో ఉండగలదని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విసి ఆచార్య విశ్వనాథ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల ప్రేమ, దయ క్షమాగుణం కలిగి ఉండాలని దైవ గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయన్నారు. ఆ గ్రంథాల్లోని సారాంశాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకుని ఆచరణలో పెట్టినప్పుడే మానవ జన్మకు సార్థకత ఉంటుందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సమాజంలో ప్రజల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడమే తమ ధ్యేయం అన్నారు. లయన్ మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఏ మతం అయినా విశ్వ శాంతినే కోరుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వెంకటసుబ్బయ్య, వైవీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ పోతుల వెంకటరామిరెడ్డి, డాక్టర్ రంగ నాథ్ రెడ్డి, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్ రెడ్డి, రాజశేఖర్ రాహుల్,గౌరీ శంకర్ పాస్టర్ విజయ్ కిషోర్ మాట్లాడారు. అనంతరం పాస్టర్ విజయ్ కిషోర్ పర్యవేక్షణలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కడప : కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. కేంద్ర కేబినెట్ నుంచి ఆయనను తొలగించాలన్నారు. ఈనెల 23వ తేదీన బాబా సాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి మంత్రి అయినప్పటికీ, పార్లమెంటులో డాక్టర్ అంబేద్కర్ పేరును ఉచ్చరించడాన్ని కూడా సహించలేకపోవడం దారుణమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అమిత్ షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసి భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో నీటి సమస్య తరతకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం నక్కలపల్లిలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల పనులు పరిశీలించారు. నక్కలపల్లి స్టోరేజ్ ట్యాంక్ ప్రధాన పైప్ లైన్‌లో లీకేజీ ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో గత రెండు రోజుల నుంచి నిరంతరాయంగా పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి అయినా పైప్ లైన్ లో మళ్ళీ సమస్య తలెత్తడంతో పనులను దగ్గర ఉండి పరిశీలించి పూర్తి చేశారు. సోమవారం నుంచి యథావిధిగా ప్రజలకు నీటి సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, కమిషనర్, ఇంజినీర్‌లు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న యాచకులకు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలిని దృష్టిలో పెట్టుకొని మదర్‌థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్, రూరల్ ఆర్గనైజేషన్ అవేర్నెస్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండు, సాయి బాబా గుడి, పులివెందుల రోడ్డు, బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ రైతు మార్కెట్, గండి క్షేత్రం వద్ద రోడ్డుపై నిద్రిస్తున్న యాచకులకు, నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశారు. దాతల సహకారంతో 20 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు విజయ్ కుమార్, నాగేంద్రలు తెలిపాం కార్యక్రమంలో బిఎన్ఆర్ డ్రైవింగ్ టెక్నికల్ కరస్పాండెంట్ నాగేంద్ర, రూరల్ అర్గనైజింగ్ అవేర్నెస్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ నాగన్న, మదార్ థెరిస్సా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జూటూరు విజయ్ కుమార్, సునీల్, ప్రసాద్, శివాంజీనేయులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

జనవరి 4,5 తేదీల్లో నిర్వహించబోయే సిపిఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ కోరారు. ఆదివారం ఉదయం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ జనవరి 4న కడప నగరం లో ఉదయం 10 గంటలకు జియోన్ కాలేజీ నుంచి ర్యాలీ ప్రదర్శన అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా కర్నూల్ మాజీ శాసనసభ్యులు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ మాసభలో సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సిపిఎం పార్టీ చేసిన కృషిని సమీక్ష చేసి రానున్న కాలంలో ప్రజల సమస్యల పట్ల పార్టీ చేయవలసిన పోరాటాల పైన చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు తిరుమలయ్య సుబ్బరాయుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టివారిపల్లెను మునక ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు సందర్శించడానికి వెళ్తున్న నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆదివారం శెట్టివారిపల్లె గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. గండికోట జలాశయం ప్రాజెక్టు వెనుక జలాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శెట్టివారిపల్లె గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించాలని గ్రామస్తులు మంత్రికి, ఎమ్మెల్యే ఆది నారా యణరెడ్డికి విన్నవించారు.కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత సోలార్ పథకం

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ వినియోగదారులకు ప్రధానమంత్రి సోలార్ సూర్య ఘర్ ఉచిత సోలార్ ప్యానల్ పథకం అమలు చేస్తోందని అవకాశాన్ని చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఇంజినీర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. టుకెడబ్ల్యూపి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నాయని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కు అదనమన్నారు. విద్యుత్ వాడుకోని మిగిలిన విద్యుత్తును శాఖ ఆయా యూనిట్ల రేట్లను బట్టి ఖాతాలో డబ్బు జమ చేస్తుందని తెలిపారు. ఇది అదనపు ఆదాయం అన్నారు. వినియోగదారులు pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ నిర్వహించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ మైనుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్ లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ జెడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బైబిల్ క్విజ్ నిర్వహించారు. పిల్లలు, మహిళలు ఉత్సాహంగా కోలాటం ,ఆట,పాటలతో అలరించారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్రహాం, ఏసుదాసు, జయన్న, రమేష్, చంద్ర, సంఘ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కడప :

కడప నగరం ఆజాద్ నగర్‌లోని క్రీస్తు ప్రార్థన మందిరం అధ్యక్షులు పాస్టర్ పి.శ్రీనివాసులు, సిస్టర్ లక్ష్మి వారి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ పి.మహేష్, పాస్టర్ కెఆనంద్ హాజరయ్యారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి అన్న దానం చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం ప్రతినిధి పి.రవితేజ, విశ్వాసులు ధనరాజు, శాంతమ్మ, హరి క్రిష్ణ, శామ్ రాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో జమ్మూ కాశ్మీర్ వాసి మృతి

ప్రజాశక్తి- లింగాల

మృతి చెందిన ఫరూఖ్ అహ్మద్

లింగాల మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో జమ్మూ కాశ్మీర్ వాసి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఎఇ రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన విద్యుత్ ప్రమాద సంఘటనపై పరిశీలించారు పోలీసుల కథల మేరకు వివరాలు... జమ్మూ ప్రాంతానికి చెందిన ఫరూఖ్ అహ్మద్ లారీ డ్రైవర్. ఇతడు శ్రీనగర్ ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల కిందట లారీలో అరటి లోడ్ కోసం లింగాలకు వచ్చాడు. ఆదివారం లింగాల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కన లారీని నీటితో శుభ్రం చేసుకుంటున్నాడు. అదే సమయంలో ప్రమాదవశాత్తు ఆ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తెగి లారీ మీద పడింది. దీంతో అతను విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బంధువులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని చేరవేశామని ఆయన తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

'సీమ' బలిజల ఎదుగుదలకు కృషి

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమలో బలిజల రాజకీయ ఎదుగుదలకు తమ వంతు కృషి చేస్తామని జలవనుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం మేడా కన్వెన్షన్ హాలులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్, టింబర్ డిపో శ్రీనివాసులు ఆధ్వర్యంలో బలిజ, ఒంటరి, కాపు, తెలగ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన బలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న బలిజల రిజర్వేషన్స్‌ను అప్పటి ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి తొలగించారని పేర్కొన్నారు. అనంతరం దళిత బిడ్డ దామోదర సంజీవయ్య పునరుద్ధరించారని తెలిపారు. తరువాత వచ్చిన కాసు బ్రహ్మానంద రెడ్డి రద్దు చేశారని చెప్పారు. మళ్లీ చంద్రబాబు నాయుడు 5 శాతం ఈడబ్ల్యుఎస్‌లో బలిజలకు కల్పిస్తే జగన్మోహన్‌రెడ్డి వాటిని తొలగించారని గుర్తు చేశారు. ఎన్టీ రామారావు పార్టీ స్థాపించిన తరువాతే కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. అధికారంలోనికి వచ్చిన వైసిపి 5 సంవత్సరాలు కాపు కార్పొరేషన్ నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ బలిజలకు న్యాయం ఒక్క తెలుగుదేశం పాలనలోనే సాధ్యమైందని చెప్పారు. రత్న సభాపతి, బ్రహ్మయ్యకు మంత్రి పదవులు, సి రామచంద్రయ్యకు ఎమ్మెల్సీ ఇచ్చి ప్రోత్సహించారని తెలిపారు. బలిజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై కూడా ఉందన్నారు. టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి హవాలో రాయలసీమలో బలిజలకు సీట్లు ఇచ్చి ఉంటే విజయం సాధించే వారని పేర్కొన్నారు. అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకుని రాజకీయంగా ఎదగాలని చెప్పారు వైసిపిని గద్దె దించేందుకే టిడిపి, బిజెపిని సమన్వయ పరచకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల సీట్ల సర్దుబాటులో రాజీ పడ్డారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత ప్రాతినిధ్యం వచ్చేలా కృషి చేస్తామన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయంగా ఎదగాలంటే ఆర్థికంగా బలపడాలని హార్దికంగా బలపడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారం దిశగా పరిష్కార దిశగా పోరాటం చేసినప్పుడే ప్రజలు హాజరిస్తారని చెప్పారు ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో రాణించడం సులువు కాదని, నాయకత్వ లక్షణాలు అందరికీ రావని, వచ్చిన వాడిని చొక్కా పట్టి లాగ వద్దని హితవు పలికారు. దయచేసి ఇతర కులాలను కించపరచవద్దని సూచించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉన్నాయని, ఎన్నికల్లో ఎవరికైనా మద్దతు ఇస్తామని, తమకు రావాల్సిన సీట్లు మాకు ఇవ్వండి అని డిమాండ్ చేస్తామన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా బలిజలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన హరి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీ రామారావు బలిజలకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బలిజలు కూటమికి 90శాతం ఓటు వేసి గెలిపించాలని గుర్తు చేశారు. తమ వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళదామని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమావేశంలో బలిజ నాయకులు కన్నా నాగరాజు, సుంకర శ్రీనివాస్, పీ.వీ.ఎస్.మూర్తి, దాసరి రాము, అమరప్ప, ఎద్దుల సుబ్బరాయుడు, బండి బాబు, దుర్గాప్రసాద్, సుధా మల్లికార్జున, 114 రమణ, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గురప్ప, తాతంశెట్టి నాగేంద్ర, జిల్లాలోని బలిజ వర్గీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు

జడ్డిగారి కొట్టాలు వద్ద సాగులో ఉన్న వేరుశనగ పంట

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల పరిధిలోని పలు గ్రామాలలో సాగైన వేరుశనగ, మినుము, జొన్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఖరీఫ్‌లో వరి సాగు చేయని రైతులు ఆరుతడి పంటలు సాగు చేపట్టారు. ముఖ్యంగా పెన్నా నది పరివాహక గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, అనంతపురం, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరులతోపాటు సిద్ధారెడ్డిపల్లి , మైత్రాయపల్లె గ్రామాల పరిధిలో 3 వేల ఎకరాల్లో వేరుశనగ, మినుము పంటలను రైతులు సాగు చేశారు. సాధారణంగా సెప్టెంబర్ నెలలో వేరుశనగ సాగు చేపడతారు. అయితే ఈ ఏడాది అక్టోబర్ చివరి వరకు సాగు మొదలు పెట్టారు. ఈ ఏడాది మైలవరం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయడంతో పంటకు సాగునీటి కొరత లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగ లో కలుపులు తీస్తూ సతువలు చల్లుతున్నారు. రబీ సీజన్‌లో వేరుశనగతో పాటు రైతులు అధికంగా మినుము, మొక్కజొన్న పంటలను కూడా సాగు చేశారు. వెంగన్న గారి పల్లి, చియ్యపాడు గ్రామాల పరిధిలో శనగ పంట సాగైంది. మినుము పంట ఏడాది దిగుబడులు తగ్గే అవకాశం కనిపిస్తుంది. ముందస్తుగా సాగుచేసిన మినపపంట అధిక వర్షాలకు దెబ్బతింది.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

- సబ్ యూనిట్ వైద్య అధికారి సిద్దయ్య

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నసబ్ యూటిన్ అధికారి

దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ డివిజన్ వైద్యాధికారి సిద్దయ్య అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం-3 ను సందర్శించి విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడ అనాఫిలిస్ అనే దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. డెంగ్యూ వైరస్ ఇన్ఫెక్ట్ అయిన దోమకాటు తరువాత 3 నుండి14 రోజులలో రావచ్చుని తెలియజేశారు. మెదడువాపు ఇది కూడా ఒక వైరస్ వల్ల కలిగే వ్యాధి వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన క్యూలెక్స్ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. 2 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు ఈ వ్యాధి బారినపడే అవకాశాలు ఎక్కువ అన్నారు. దోమ కాటుకు గురైన నాలుగు నుండి ఆరు రోజులకు లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు రవీంద్ర బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న శివనారాయణ

జిల్లా లో అర్హులైన చేనేత కార్మికులకు అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి , వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ తెలిపారు. ఆదివారం వేపరాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంటింటికీ తిరిగి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం నేతన్నల హక్కుల కోసం అనునిత్యం పోరాడుతుందన్నారు.అందులో ఎన్నో పోరాటాలు సాధించి విజయాలు సాధించిన ఘనత ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘందే అన్నారు. ముఖ్యంగా జిల్లాలో ప్రధాన భాగం చేనేతలు ఎక్కువ మంది మగ్గంపై జీవిస్తుంది జమ్మలమడుగు నియోజకవర్గంలోనే అన్నారు. నేతన్నలకు అర్హులైన వారికి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు దూరం అవుతున్నారన్నారు. సబ్సిడీ రుణ, ఇంటి స్థలాలు ఇతర సంక్షేమ కార్యక్రమాలకు అనర్హులుగా మిగుల్తున్నారన్నారు. గతంలో కనీసం మాన్యువల్‌గా అయిన కార్డులు ఇచ్చేవారని ఇప్పుడు అది కూడా ఇవ్వడం లేదన్నారు. అర్హులైన అందరికీ చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కోరుతోందని అన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సంజీవ రాయుడు, నారాయణ, దాసు పల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు ప్రసాద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నిత్యం విద్యార్థులు పాఠశాల నుండి వెళ్ళిపోతున్నారని, సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోనే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయని, విధుల పట్ల అలసత్వం వహిస్తూ నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ రామకృష్ణా ఒడ్డిని విధుల నుండి తొలగించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగులోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన విద్యార్థి పాఠశాల నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన సంఘటన అందరికీ తెలిసిందేన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చాలా చోటు చేసుకున్నాయని అన్నారు. విద్యార్థులు రాత్రిళ్ళు చెప్పకుండా వెళ్లి పోతూ ఉంటే ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిని బట్టి భద్రత ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందన్నారు. పాఠశాల చుట్టూ కాంపౌండ్ గోడ తక్కువ ఎత్తులో ఉందని, చుట్టూ కంచె కూడా లేదని వాపోయారు. ప్రిన్సిపల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్షణమే బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్‌ను జిల్లా కో ఆర్డినేటర్ విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సురేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో చక్రపాణిరెడ్డి

నృత్య ప్రదర్శనలో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

కడప నగరంలో చేపట్టిన నృత్య ప్రదర్శనలో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. శివ సాయి గ్రూపు, వేదాస్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన చేసినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. గ్రూప్ డాన్స్ విభాగంలో మిథునశ్రీ, హేమేంద్రి, సిద్దలక్ష్మి, హిమబిందు, సాయి నిఖిత, షణ్ముఖ ప్రియ, లాస్య , గణేష్ , పవన్ , బద్రీనాథ్ , సైఫుల్లా , బాలయోగిలు జిల్లా మొదటి స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నట్లు చెప్పారు. చిత్రలేఖనం జూనియర్ విభాగంలో గంగ నందిత రెండవ స్థానంలో గెలిచి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు చెప్పారు. విజయాల ద్వారా తమ పాఠశాల విద్యార్థులు సృజనాత్మకత, కృషి, పట్టుదలతో పాఠశాలకు పేరును తెచ్చినట్లు తెలిపారు. మరిన్ని విజయాలను విద్యార్థులు సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడ ప్రోత్సాహించాలని కోరారు.

దాస్ ఉత్సవ్‌లో 'గౌతమ్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని నాగలకట్టలో ఉన్న గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు వల్లూరు వేదాస్ ఉత్సవ్‌లో అత్యుత్తమ ప్రతిభను కనపరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎ.లక్ష్మిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఏడాదిలో కడప జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను ఘనపరిచి మూడవ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. తమ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా స్పోర్ట్స్, డాన్స్ కాంపిటేషన్లు కూడా ఉన్నత స్థాయి బహుమతులు సాధించారని తెలియజేశారు. విద్యార్థులకు చక్కటి డాన్స్ ప్రాక్టీస్ అందించినటువంటి మాస్టర్ పవన్ కుమార్‌ను కరస్పాండెంట్ అభినందించారు. 3వ బహుమతి సాధించినటువంటి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

బాదుడు ప్రభుత్వం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం బాదుడు ప్రభుత్వంగా తయారైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ప్రజలను అనేక విధాలుగా బాదడం ప్రారంభించిందని చెప్పారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ 15,485 కోట్ల అదనపు భారం మోపిందని చెప్పారు. జనవరి 1 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాలలో భూములు, నివాస, వాణిజ్య భవనాలు,అపార్టు మెంట్లు, ప్లాట్లపై దాదాపు 20 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు భారం మోపుతున్నట్లు చెప్పారు. పట్టణాలు, నగరాలలో మంచినీటి సరఫరా మీద యూజర్ ఛార్జీల భారం త్వరలో మోపుతారని చెప్పారు. 5 శాతానికి మించి జిఎస్‌టి స్లాబులో ఉన్న వస్తువుల రవాణాపై 1 శాతం వరద సెస్సు విధించాలని రాష్ట్ర ప్రభుత్వం రాజస్థాన్‌లో జరిగిన జిఎస్‌టి 55 వ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిందని తెలిపారు. ఈ విధంగా ప్రజల మీద బాదుడు కార్యక్రమం ప్రారంభించింది బాబు ప్రభుత్వమని చెప్పారు. ప్రజా పీడిత ప్రభుత్వమని మండిపడ్డారు. గండికోట రిజర్వాయర్ కిందకొండాపురం, ముద్దనూరు మండలాల్లో 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఇంకా కొంతమందికి నష్ట పరిహారం అందలేదని చెప్పారు. త్వరగా నష్ట పరిహారం అందేటట్లు చూడాలని కోరారు. జిల్లాలో వామికొండ సాగర్, సర్వరాయ సాగర్ తదితర ప్రాజెక్టుల కింద ఉప కాలువలు, పంట కాలువలు లేని కారణంగా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

శనగ, కంది రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న శనగ, కంది రైతులు ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా రైతులు శనగ, కంది పంటలు విస్తారంగా సాగు చేశారన్నారు. కార్తీకమాసం మొదలుకొని ఇప్పటివరకు ఒకవైపు చిరుజల్లులు మరోవైపు మబ్బులు వెంటాడాయని తెలిపారు. వీటి ప్రభావం వల్ల కంది పంట దిగుబడి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది అన్నారు. కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి శనగ రైతుకు ఉంది అన్నారు. అటు ఖరీఫ్ ఇటు రబీ సీజన్‌లు రైతులను నిరాశకు గురి చేశాయన్నారు. రైతులకు పరిస్థితి తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు వెల్లడించారు. దెబ్బతిన్న ప్రతి రైతును ఆర్థికపరంగా ఆదుకోవడంతోపాటు పంట రుణాలు రిషెడ్యూల్ చేయడమా లేదా మరోసారి వడ్డీ లేని రుణాలు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

జోగిరెడ్డిని అభినందిస్తున్న డిఎస్‌పి మురళీనాయక్

ప్రాజెక్ట్స్ చైర్మన్ జోగిరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల పరిధిలోని టిబిసి హెచ్‌ఎల్‌సి ప్రాజెక్ట్స్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని పలువురు ప్రముఖులు అభినందించారను. ఆదివారం స్వగ్రామమైన కసనూరులో పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్, పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణ వచ్చి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మండలంలోని పలువురు టిడిపి నాయకులు కలిసి అభినందించారు.

31 వరకూ పంటల బీమా గడువు పెంపు

ప్రజాశక్తి-ఖాజీపేట

రబీ సీజన్‌లో పంటలను సాగు చేసే రైతులు ఈనెల 31 వరకు పంటల బీమా చేసుకోవడానికి అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగార్చన ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న, వరి, వేరుశనగ, పెసర, మినుము పంటలకు బీమా చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గడువును పెంచిందని బీమా చేయించుకొని రైతులు త్వరపడాలని ఆమె పేర్కొన్నారు.

అంబేద్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి - చాపాడు

ఇటీవల రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ఆయన వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చాపాటి రామ సుధాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అణగారిన వర్గాలకు అండగా సమానత్వం, సోదర భావం ప్రజాస్వామ్యం గణతంత్ర విలువలతో ఎంతో అద్భుతంగా లిఖించిన మన భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడం మంచిది కాదన్నారు. హోం మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఈ తరహాలో మాట్లాడడం శోచనీయమన్నారు. బిజెపి పెద్దలు యావత్తు ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు.